క్లుప్తంగా

27న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పెనుమూరు(కార్వేటినగరం) : బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నీలకంఠేశ్వర రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పెనుమూరు మండలం నుంచి బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 27వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. సామిరెడ్డిపల్లి, కలవకుంట, తాటిమాకుల పల్లి, ఆరే.కే పురం, చార్వాగానిపల్లి ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు మధ్యాహ్నం 12 గంటల నుంచి హాజరు కావాలని సూచించారు.

రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు

గంగాధర నెల్లూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 521 మంది లబ్ధిదారులకుగాను 473 మంది ఇంటర్వ్యూలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏవో లోకేష్, బ్యాంకు మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

రుణాల ఇంటర్వ్యూలు

నింద్ర: మండలంలో వివిధ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 162 మందికి 119 మంది హాజరయ్యారని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ తెలిపారు. నింద్ర గ్రామీణ బ్యాంకు, పాలమంగళం సప్తగిరి బ్యాంకు, వెంగళత్తూరు సప్తగిరి బ్యాంకు, నగరి సప్తగిరి బ్యాంకు, నగరి ఎస్‌బీఐ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు చెప్పారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



పుత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పుత్తూరు: న్యాయవాదుల చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు. పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు-2025ను ప్రవేశపెట్టాలని చూస్తోందని, దీనిని దేశ వ్యాప్తంగా న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కేంద్రం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఉదయ్‌కుమార్, సంజీవి, శేషాచలం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ పురుషోత్తం


వెదురుకుప్పం: గ్రామాల్లో విధిగా ఇంటి పన్ను వసూలు చేయాలని ఈఓపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి నుంచి చెత్త సేకరణను ముమ్మరం చేయాలని చెప్పారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. డంపింగ్ యార్డులను శుభ్రంగా ఉంచుకుని ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించాలని చెప్పారు. పేడ దిబ్బలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

భవిత కేంద్రం తనిఖీ



పిల్లలతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

పుత్తూరు: పట్టణంలోని భవిత కేంద్రాన్ని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ గోపాల్‌కృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను, వారి పురోగతిని టీచర్లను అడిగి తెలుసుకున్నారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు ఆనంద్, సూర్యకుమారి పాల్గొన్నారు.



ముస్తాబవుతున్న హనుమతేశ్వర ఆలయం



ముస్తాబైన ఉమామహేశ్వరాలయం

శివపూజకు వేళాయె..!

- నేడు మహాశివరాత్రి
- ముస్తాబైన ఆలయాలు

నగరి : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మున్సిపాలిటీ, మండలంలోని ఈశ్వరాలయాలు ముస్తాబయ్యాయి.శివరాత్రి సందర్భంగా పట్టణంలోని కరకంఠేశ్వర ఆలయంలో శతరుద్రీయ మహాయాగం, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. దీనికి సంబంధిత ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలోని గుండ్రాజుకుప్పం పంచాక్షర గిరులపై ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న హనుమతేశ్వర క్షేత్రంలో సరస్వతి, శివపార్వతులు, అభయాంజనేయస్వామి ఆలయాలకు ఇప్పటికే రంగులు వేసి ముస్తాబు చేశారు. భారీ ఎత్తున అన్నదానం చేయనున్నారు. ఇక, ముడిపల్లె అగస్తీశ్వర ఆలయం, నాగతీర్థం కొండపై నాగలింగేశ్వరస్వామి ఆలయంలోను శివరాత్రి ఏర్పాట్లు జోరుగా చేస్తున్నారు. ఇప్పటికే కొండ కింద నుంచి పైవరకు వేసిన విద్యుత్ దీపాలు కొత్త అందాలు తెచ్చాయి. పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలోని బుగ్గ అగ్రహారంలో టీటీడీ ఆధీనంలో దక్షిణకాశిగా పిలవబడే అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం హరికథ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. కీళపట్టు త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో క్షీరసాగర మథనం ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేట అరుణాచలేశ్వర ఆలయంలో అన్నదానం చేస్తారు. మాంగాడు మార్కండేశ్వర ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, నందిపూజ చేస్తారు.



నింద్ర: అలంకరణలో శివలింగం

నింద్రలో..

నింద్ర: మండలంలోని పలుగ్రామాల్లోని శివాలయాలు శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. స్థానిక ప్రాచీన శివాలయంలో, ఎలకాటూరు, అత్తూరు, కావునూరు, చవరంబాకం గ్రామాల్లోని బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు స్థానికులు తెలిపారు.

శివరాత్రికి ముస్తాబైన శైవాలయాలు

గంగాధర నెల్లూరు: పరమ పవిత్రమైన శివరాత్రి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని గంగాధర నెల్లూరులో గంగాధరేశ్వర ఆలయం, కొట్రకోనలోని మల్లేశ్వర స్వామి ఆలయం, మహాదేవ మంగళంలోని ఉమామహేశ్వర ఆలయం, సిద్దేశ్వర కొండపై సిద్దేశ్వరాలయం, వెజ్జు పల్లి గ్రామంలోని అవుదేవర నందీశ్వర ఆలయం శివరాత్రి సందర్భంగా విద్యుత్ దీప కాంతులతో, ప్రత్యేక పుష్పాలంకరణతో అంగరంగ వైభవంగా ముస్తాబయ్యాయి. శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని శివాలయాలలో బుధవారం ప్రత్యేక అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్తలు గ్రామస్తులు తెలిపారు.



విద్యుత్ కాంతులతో బుగ్గ కాశీవిశ్వేశ్వర ఆలయం



నాగతీర్థం కొండపైకి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలతో కొత్త సొబగులు



విద్యుత్ కాంతులతో అగస్తీశ్వర ఆలయం

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పుత్తూరు: పురపాలక సంఘంలోని ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, ఆప్కాస్ రద్దు చేసి, దళారీ వ్యవస్థను తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దళారీ వ్యవస్థ వస్తే జీతాలు సక్రమంగా అందవని, పీఎఫ్, ఈఎస్ఐ వాటా నిధులు చెల్లించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గణేష్, విజయ్, మునయ్య, మణికంఠం, ఢిల్లీ, అంకయ్య, కుమార్, చెంచయ్య, సుభాషిణి, జయంతి, కోమల తదితరులు పాల్గొన్నారు.

పిల్లల శక్తిసామర్థ్యాలను వెలికి తీయండి



మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలరాజు

పుత్తూరు: పిల్లల శక్తిసామర్థ్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని డీవైఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. డీవైఈఓ సందర్శించి మాట్లాడారు. పిల్లల్లో శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధాభివృద్ధి, సామాజిక భావోద్వేగ అభివృద్ధి, సృజనాత్మకతకు చెందిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) బాగుందన్నారు. తయారు చేసిన కృత్యాలతో పిల్లల శక్తిసామర్థ్యాలను గుర్తించి దానికనుగుణంగా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. ఎంఈఓ తిరుమలరాజు మాట్లాడుతూ, శిక్షణతో మంచి ఫలితాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుబ్రమణ్యం, కేఆర్‌పీ అనిత, డీఆర్‌పీ రమేష్, వెంకటేష్, భూపతి, సీడీపీఓ సంధ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనిత, గీతాంజలి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలోనే కర్మక్రియలు

నగరి: కుశస్థలి నదికి సమీపంలో పట్టణానికి చెందిన హిందూ శ్మశాన వాటికలో గ్యాస్ బర్నింగ్ ద్వారా దహన క్రియలు ప్రారంభవడం విదితమే. ఇకపై అక్కడ కర్మక్రియల భవనంలోనే కర్మక్రియలు చేసుకునే సదుపాయం కూడా కల్పిస్తున్నామని, ఇందుకుగాను రూ.4వేలు మున్సిపాలిటీకి చెల్లించి వినియోగించుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు.

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ



జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీలకు వివరిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం ఉన్నత (బాలిక) పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. శిక్షణ పొందిన వారికి ఎంఈఓ పద్మావతి సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. బాలల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే పిల్లలకు ఆట, మాట, పాట, కథ, హావభావాలతో విద్యాబోధన చేయాలన్నారు. శిక్షణలో గ్రహించిన విషయాలతో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2, తులసీరాం, నాగరాజు, ప్రభావతి, జయశ్రీ, రోజారమణి, మనీల తదితరులు పాల్గొన్నారు.

విజయపురంలో...

విజయపురం మండలం ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ముగింపు పురస్కరించుకుని ఎంఈఓ-2 హరిప్రసాద్, ఎంపీడీఓ రాజేంద్రన్ సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, డీఆర్‌పీలు శ్రీనివాసులు, పురుషోత్తం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.





వడమాలపేటంలో శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, విజయపురంలో..

చిన్నారుల భవితకు పునాది.. జ్ఞానజ్యోతి

పాలసముద్రం : మారనున్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల భవిష్యత్‌కి జ్ఞానజ్యోతి పునాది అని ఎంఈఓలు రాజేంద్ర ప్రసాద్, గిరిజ తెలిపారు. ఎమ్మార్సీ భవనంలో మంగళవారం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. 3-6 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

కార్వేటినగరం: వేసవి కాలం ఆరంభమైన నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా అరికట్టి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సీడీ కండ్రిగ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని పేర్కొన్నారు. ఎంపీడీవో వెంట సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

సేవకు ప్రతిరూపం జై భీమ్ ఫౌండేషన్

కార్వేటినగరం: సేవలకు ప్రతి రూపం జై భీమ్ ఫౌండేషన్ అని పాదిరికుప్పం ఉన్నత పాఠశాల హెచ్ఎం ద్రాక్షాయణి అన్నారు. పాదిరికుప్పం, కత్తెరపల్లి ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు జై భీమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో బెస్టాఫ్ లక్ కిట్‌ను విద్యార్థులకు అందించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ఫౌండేషన్ తరపున పరీక్ష సామగ్రిని అందించి పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం జైభీమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో జై భీమ్ ఫౌండేషన్ పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు వంటి పరీక్ష సామగ్రిని అందించారు. కత్తెరపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చలపతి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని, పేద విద్యార్థులకు మహోన్నతమైన జీవితాన్ని అందించడానికి జై భీమ్ ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఫౌండేషన్ సభ్యులు నరేష్, బొబ్బిలి, చిరంజీవి, ఉపాధ్యాయులు కిరణ్, దొరబాబు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి వితరణ చేస్తున్న జై భీమ్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఉపాధి శిక్షణ సద్వినియోగం చేసుకోండి

పుత్తూరు: ఉపాధి అవకాశాలను యువతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకుపోవాలని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. మంగళవారం కళాశాలలోని స్కిల్ హబ్‌లో సేవింగ్ మెషిన్ ఆపరేటర్ (టైలరింగ్) ఉచిత కోర్సును ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణానంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు కోటేశ్వరయ్య, వీరయ్య, అధ్యాపకులు నరసింహులు, శిక్షకురాలు పర్వీన్‌భాను, కో-ఆర్డినేటర్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

టీచర్లపై ఎంఈఓ ఆగ్రహం



ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంఈఓ

నగరి : మండలంలోని వేలావడి ఎస్టీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఎంఈఓ శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలను ప్రార్థనా సమయంలో ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, సహోపాధ్యాయుడు ఇద్దరు ఆ సమయానికి హాజరు కాకపోవడం, ప్రతిరోజూ ప్రార్థన చేయడం లేదని గుర్తించారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు లేకపోవడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పనితీరుపై గ్రామస్తులు కూడా ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. టీఏఆర్ఎల్ నిర్వహణ సక్రమంగా లేకపోతే ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆమె హెచ్చరించారు.